# అతని కోసమని

—చంద్రశేఖర్


అది శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం,

వయసులో ఉన్న యువతీ యువకులకు దేవాలయంలోని దేవుని కంటే ఆ ఆలయ ప్రాంగణమంటేనే చాలా ఇష్టం. అదెందుకో అందరికీ తెలిసిన విషయమే. రెండు చేతులను జోడించి తమ కోరికల లిస్టును దేవునికి చెప్పేసిన తరువాత, ప్రతి ఒక్కరి కళ్ళల్లోను వాటిని ఆయన నెరవేరుస్తాడన్న ఆశ, భుజాలపై నుండి బరువు దింపేసుకున్న ఫీలింగ్.

అది సాయం సంధ్యా సమయం.

అందమైన అమ్మాయి స్పర్శ కోసం పడరాని పాట్లు పడే అల్లరి అబ్బాయిలా, చల్లని పిల్లగాలి ఆ ప్రదేశమంతా తిరగాడుతోంది.

ఆలయం చుట్టూ పెద్ద చెరువు. చెరువుకు పడమటి అంచున పుడమి తల్లితో పెనవేసుకున్న అనుబంధానికి వీడ్కోలు చెప్పలేక భారంతో జేవురు బారిన సూరీడు, దూరంగా ఐకమత్యానికి ప్రతీకలా వరుసలో ఎగురుతున్న అందమైన కొంగల గుంపు, చెరువు మధ్యలో తమ పొడుగాటి ముక్కలను ఒకదానికొకటి రాపాడించుకుంటూ ఊసులాడుకుంటున్నాయి రెండు బాతులు.




అక్కడి ప్రకృతిలోని అందాల్ని ఆస్వాదిస్తూ, ఆహ్లాదాన్ని అనుభవిస్తూ, ఆ రెండు బాతులను చూస్తోంది సాహితి, వెంటనే ఆమె పెదవులపై దేవుని ముందు వెలిగించిన చిన్న దివ్వెలా వెలసింది ఓ చిరునవ్వు. ఆమెనక్కడ అలా చూసిన వారెవరైనా ఏ ప్రియుడి కోసమో ఎదురు చూస్తున్న ప్రియురాలని అనుమానిస్తారు. అంతలో,

"వెళ్దామా అమ్మా".... వెనుదిరిగింది చూసింది.

"ఏదో లోకంలో విహరిస్తున్నట్టున్నావు" ఆమె వైపే చూస్తూ అడుగుతున్నారు కృష్ణమూర్తిగారు. చిన్న బిడియంతో కూడిన నవ్వుతో "అదేం లేదు మాష్టారు, పదండి వెళ్దాం" అంది. ఇద్దరూ కదిలారు.

రోజూ ఇద్దరూ స్కూలు నుండి వస్తూనే, కృష్ణమూర్తిగారు కూరగాయలు కొనటానికి బజారుకు వెళ్ళటం, ఆయన వచ్చేంత వరకూ, సాహితీ ఈ ఆలయం దగ్గర వేచి ఉండటం అలవాటు.

★ ★ ★

క్షణిక మోహావేశంలో పాపం తెలియని పసిపాపకు తల్లి అయిన ఓ స్త్రీ, అనాథ శరణాలయానికి అప్పగించగా, అనాదల మధ్య పెరిగిన అమ్మాయి సాహితి.

ప్రపంచంలోని ప్రతి వాళ్ళు తన వాళ్ళే అనుకుని ఆత్మ విశ్వాసంతో పెరిగింది ఆమె.

పుట్టినప్పటినుండి కష్టాలతోనే చుట్టరికం చేయడం వలన ప్రతి చిన్న ఆనందాన్ని మన స్పూర్తిగా ఆస్వాదించాలన్న స్వార్థం ఆమెది.

ఎదుటి వ్యక్తికి మేలు చేయగలదో లేదో తెలియదు గానీ, ఎట్టి పరిస్థితులలోను కీడును తలపెట్టని వ్యక్తిత్వం ఆమెది.

చిన్నతనంలోనే తొందరగా జీవితంలో స్థిరపడాలన్న ఉద్దేశ్యంతో సెకండరీ స్కూలు టీచర్‌గా సెలెక్టు అయి ఆ ఊరు వచ్చింది.

ఒక రోజు స్కూలు వదిలాక మార్కెట్లో షాపింగ్ చేసుకుని వస్తూందామె. అపుడు సమయం సుమారు రాత్రి ఏడు గంటలవుతుంది.

ఎదురుగా చేతిలో సీసాతో వస్తున్నాడో వ్యక్తి.

అతనిని చూడగానే మత్తుగా త్రాగిన వ్యక్తి అని గుర్తించింది. అతను వస్తున్న దారికి కొద్దిగా దూరంగా జరిగి నడవడం ప్రారంభించింది.



అంతలో దారి మధ్యలో నడుస్తున్న అతనిని బ్రేకు ఎంత వేసినా ఆగని ఓ స్కూటర్ వచ్చి గుద్దేసింది. ఒంటిలో నడవడానికి కూడా శక్తి లేని ఆ వ్యక్తి దూరంగా పడిపోయాడు. 'అమ్మా' అన్న చిన్న శబ్దం మాత్రం అతని నోటి వెంట వెలువడింది. ఆ స్కూటర్ వాలా మునుపటి కంటే స్పీడు పెంచి ముందుకు దూసుకు పోయాడు.

ఆ దృశ్యాన్ని అలాగే చూస్తున్న సాహితికి నోట మాటరాలేదు.

కాని అది క్షణకాలం మాత్రమే.

వెంటనే తేరుకుంది. అతని దగ్గరగా వెళ్ళి చూసింది. అతనికి అప్పటికే స్పృహ తప్పిపోయింది. అటు వైపుగా వస్తున్న రిక్షా సాయంతో అతనిని ఆసుపత్రికి చేర్చింది. డాక్టర్లు పరీక్ష చేస్తూంటే, ఆమె పచార్లుకు మాత్రమే పరిమితమయ్యింది.

అతనికి ఏమౌంతుందో అన్న భయం, ఏమీ కాకూడదన్న ఆశ.

"హి విల్ బి ఆల్ రైట్" ఆమె కంగారును చూసి బయట కొచ్చిన డాక్టర్ చెప్పాడు.

"థాంక్యూ డాక్టర్" మనసు తేలికపడినట్లు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేసింది.

"మీరు రేపు ఉదయమే ఇంటికి తీసుకు వెళ్ళవచ్చు" అన్నారాయన.

ఆమె అప్పటికే నిర్ణయించుకుంది. ఆ వ్యక్తికి నయమయ్యేంతవరకూ తన ఇంట్లోనే ఉంచుకోవాలని. తరువాత రోజు అతనిని ఇంటికి తీసుకు వచ్చింది. రెండవరోజు శెలవుపెట్టి ఆయనకు సేవలు చేయడంలోనే గడిపింది. మూడు రోజులలో ఆయన మామూలు మనిషి అయ్యాడు.

"మీరు చేసిన మేలును ఈ జీవితమంతా మరచిపోలేను. కనీసం మీ ఋణం తీర్చుకునే అవకాశాన్నైనా ఇవ్వండి." వెళ్ళబోయేముందు మనస్ఫూర్తిగా అతని నోటినుండి వెలువడిన మాటలివి.

ఆమె అతని వైపు అదోలా చూసింది. అతను తలక్రిందకు దించుకున్నాడు.

"సమయం వచ్చినపుడు నేనే అడుగుతాను." అందామె.

అతను వెళ్ళిపోయాడు.

ఆరోజు సాహితి స్కూలుకి వెళ్ళింది. కానీ వెళ్ళినప్పటి నుండి ముభావంగానే ఉంది. మధ్యాహ్నం అయ్యే సమయానికి హెడ్మాష్టరైన కృష్ణమూర్తిగారి కోసం క్యారేజి తీసుకొచ్చాడు ఒకతను.

అతనిని సాహితి దూరం నుండి చూసింది.

కానీ అతను మాత్రం ఆమెను చూడలేదు.

అతని దగ్గరగా వచ్చే సమయానికే క్యారేజీ ఇచ్చేసి అతను వెళ్ళిపోయాడు.

వెంటనే కృష్ణమూర్తిగారి దగ్గర కెళ్ళి అడిగింది "ఎవరతను మాష్టారు" అని.

కృష్ణమూర్తిగారు దిగులుగా చూస్తూ "నా కొడుకమ్మా" అన్నారు.


"మీ కొడుకా" అంది ఆశ్చర్యంగా,

సాహితికి చాలా సంభ్రమంగా ఉంది. నాలుగు రోజుల పాటు తను సపర్యలు చేసి రక్షించిన వ్యక్తి కృష్ణమూర్తిగారి కొడుకా అని. ఒకవైపు ఆశ్చర్యానికి, మరోవైపు ఆనందానికి లోనవుతుందామె.

కృష్ణమూర్తి గారు చెప్పటం మొదలు పెట్టారు.

"వాడు నా కొడుకేనమ్మా, పేరు అభినవ్. చిన్నతనంలోనే వాడి తల్లి చనిపోవడంతో బాగా గారాబం చేసాను. ఎంతోమందిని క్రమశిక్షణతో తీర్చి దిద్దిన నేను నా కొడుకును మాత్రం ఓ మంచి పౌరునిగా మార్చలేకపోయాను. మొదటినుండి చదువులో ఎంతో తెలివైన వాడైనా, చెడు స్నేహాలతో తాగుడుకు బానిసయ్యాడు. పి.జి. పూర్తి చేసినా ఏ ఉద్యోగానికి ప్రయత్నించకుండా నా జీతంతోనే తాగుతూ తిరుగుతున్నాడమ్మా"

## అందాన్ని పెంచే యాపిల్‌పండు



**యా**పిల్ గుజ్జుని ఉడకబెట్టి దానిలో కొంచెం నీరు కలిపి ముఖానికి పట్టిస్తే చర్మం కాంతి వంతంగా తయారవుతుంది.

యాపిల్ రసాన్ని తేనెలో కలిపి ముఖానికి, మెడకి రాసుకున్నట్లయితే కవిలిపోయినట్లు ఉండే మచ్చలు పోతాయి. యాపిల్ రసంలో నారింజ రసాన్ని కలిపి ముఖానికి పూయాలి.

రోజుకి నాలుగైదుసార్లు యాపిల్ రసాన్ని రాసుకున్నట్లయితే ముడతలు కొద్ది రోజుల్లోనే పోతాయి.

ఆయిలీస్కిన్‌కు యాపిల్ రసంలో నిమ్మరసం కలిపి ముఖానికి పూసుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది.

యాపిల్ గుజ్జులో పాలను కలిపి ముఖానికి రాసుకుంటే మచ్చలు, గుంటలు, గాట్లు, మొటిమలు అన్నీ మాయమవుతాయి.

దుఃఖం, నిస్పృహాయత కలగలపిన గొంతుతో చెప్పారాయన.

ఆమె అంతా విన్నది, నిశ్శబ్దంగా ఆలోచిస్తున్నది.

ఆ ఆలోచనే క్రమక్రమంగా సంకల్పంగా రూపుదిద్దుకుంది.

ఆ మరుసటి రోజు....

"సాహితి మెల్లగా రోడ్ మీద నడుస్తూ ఉంది.

" బాగున్నారా.... మేడమ్" సైకిల్‌ను ఆమె ప్రక్కనే ఆపు చేస్తూ అడిగాడు అభినవ్.

అతని వైపు చూస్తూ "ఆ..." అంది చిరునవ్వుతో,

ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు.

ముందు ఆమె అడిగింది " ఈరోజు మందు తాగలేదా" అని.

అతను సిగ్గుతో తలదించుకున్నాడు.

ఆమె చెప్పటం మొదలు పెట్టింది.

"చూడండి అభినవ్ గారు, త్రాగటం మీ బలహీనత, తాగుబోతులందరూ నిజాయితీ పరులని నా అభిప్రాయం. ప్రతిరోజూ టైం అయ్యేసరికి బ్రాందీ షాపుకు హాజరైపోతారు. అయితే మిగతా విషయాలపై ఎప్పుడు ఏమి చెయ్యాలన్న ఆలోచన మీ కస్సలుండదు. ఎందుకంటే మీరు ఆ వ్యసనానికి బానిసలు కాబట్టి" అతను ఆమె చివాట్లను వింటూ నడుస్తున్నాడు.

"మీ గురించి మీ నాన్నగారు అంతా చెప్పారు. మీరు పి.జి. చేసారు. చదువులో కూడా చాలా తెలివైన వారు. ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ఆ లక్ష్యసాధన కోసం మీ సిన్సియారిటీని ఉపయోగించండి.

మీరు ఆరోజు నా ఋణం తీర్చుకునే అవకాశం ఇమ్మని అడిగారు. ఇప్పుడు అడుగుతున్నాను. మీరు త్రాగుడు మానేసి ఓ మంచి మనిషిగా మారండి, నా ఋణం తీర్చుకున్నట్లే" అనేసి వెళ్ళిపోయింది.

అతను అలాగే నిలబడిపోయాడు. ఆమె పలికిన ప్రతిమాట, అతని చెవిలో మారు మ్రోగుతున్నాయి. అతని గమ్యాన్ని నిర్దేశిస్తున్నాయి. పరివర్తన దిశగా అతని మనసుకు అడుగులను నేర్పుతున్నాయి.

★ ★ ★

"ఏంటమ్మా.... ఆలోచిస్తున్నావు" అన్న మాటలతో ఈ లోకంలోనికి వచ్చింది సాహితి, ఏంలేదు మాష్టారు"

"అబ్బాయి గురించేగా... సబ్ ఇన్స్‌పెక్టర్ ట్రైనింగ్ పూర్తి చేసుకొని వచ్చేస్తున్నాడమ్మా... ఇదుగో నీకు ఉత్తరం రాసాడు" అంటూ తనకు వచ్చిన రెండు ఉత్తరాలలో ఒకటి తన కోసం ఉంచుకుని రెండవది సాహితికిచ్చాడు.

ఉత్తరం విప్పమని, మనసు ఆనందంతో వేస్తున్న ఉరకలను అదుపుచేయలేకపోయింది ఆమె,

ఉత్తరం తెరవగానే,

ప్రియమైన సాహితికి,

ఉత్తరం తెరచినందుకు ముందుగా థాంక్స్, విహంగంలా విహరించే ఊహలకు ఊసులు నేర్పితే, అవి మనిషి మనసుకు కొంత ఊరట నిస్తాయట, ఉదయం నుండి సాయంత్రం వరకూ, శారీరకంగా ఎంతో అలసిన నాకు, నీ ఊహలతో నిండిన మనసే ఊరటనిచ్చేది. రాత్రంతా నీ తలపులతోనే నిదురపోయి , నిన్నటి రోజుని మరచిపోయి, రేపటి క్రొత్త దనాన్ని ఆస్వాదించాను. ఇంకా బాగా కష్టమనిపించిన రోజు నీవు రాసిన ఉత్తరాలను చదువుకుని నిదురపోయేవాడిని. ఏది ఏమైనా నాకో జీవితాన్ని ప్రసాదించిన నీకు ఎన్ని పుష్పమాలలను గుదిగ్రుచ్చి కృతజ్ఞతలను తెలియజేసినా అది తక్కువేనేమో! అందుకే, నీకెలా కృతజ్ఞతలను తెలియజేయాలా అని ఆలోచించాను. చివరికి, నన్ను నేను అర్పించుకోవడం మినహా ఏం చేసినా తక్కువేననిపించింది. అందుకే రేపే బయలుదేరుతున్నాను.

నీ

అభినవ్.

ఆమె మనసంతా మధురమైన భావాలతో నిండిపోయింది. ప్రేమకోసం పరితపించే హృదయం రేపటి కోసం ఎదురుచూస్తుంది.

ఆమె మాత్రం చెదరని చిరునవ్వుతో అలానే కూర్చుని ఉంది. ❋

---

## ఆంధ్ర పర్వం

(9వ పేజీ తరువాయి)

లేక విజయభాస్కరరెడ్డి అస్త్రసన్యా సానికి దారి తీస్తుందా అనేది వేచి చూడాలంటున్నారు కాంగ్రెస్ వాళ్ళంతాను. ఇదే తరుణంలో మరోవేపు యువ ఎమ్మెల్యే కొండా సురేఖ సోనియాగాంధీకి ఉత్తరం రాస్తూ సీనియర్ నేతలను ఉతికి ఆరేశారు. సీనియర్లుగా, మేధావులుగా తమకు తామే ప్రకటించుకొని పలుమార్లు వోడిపోయిన కొందరు నాయకులు కేవలం పేపర్ టైగర్లుగానే పరిమితమై ప్రజలకు దూరమౌతూ పార్టీలో శల్య సారథ్యం వహిస్తున్నారని ఆమె మాజీ ఉప ముఖ్యమంత్రి సి. జగన్నాథరావు, మాజీమంత్రి కేశవరావు తదితరులను ఆ ఉత్తరంలో విమర్శించారు. చోద్యం చూస్తున్న తటస్థ కాంగీయులు మాత్రం కలహాల కాపురం ఎప్పుడు అంతమవుతుందోనని ఎదురు చూస్తున్నారు. ❋